సాక్షి నాగర్‌కర్నూల్

శుక్రవారం । 24 । మార్చి । 2023



అవగాహనతో అరికడదాం

ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తూ క్షయ నియంత్రణకు కృషి చేస్తోంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.2 /22.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ..అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. జల్లులు పడొచ్చు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-28
(శుక్రవారం సాయంత్రం)

సహర్ 5-04
(శనివారం తెల్లవారుజామున)

న్యూస్‌రీల్

కంటి వెలుగుపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



అచ్చంపేట రూరల్‌: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమంపై సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ సుధాకర్‌లాల్‌ హెచ్చరించారు. గురువారం మండలంలోని పులిజాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి గ్రామంలో మొదటి విడత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. అలాగే రాష్ట్ర పరిశీలకులు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులతో వివరాలు సేకరించారు. క్యాంపు అధికారి డాక్టర్‌ బిక్కు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



కందనూలు: వచ్చేనెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్‌ దేవసేన జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమెతోపాటు ఎస్‌ఎస్‌సీ బోర్డు డైరెక్టర్‌ రమేష్‌ జిల్లా విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ప్రైవేట్‌ పాఠశాల యాజమాన్యం ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు నెట్‌లో నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చన్నారు. ఎక్కడైనా ప్రశ్నాపత్రాల లీకేజీ వంటి సంఘటనలు జరిగితే చీఫ్‌ సూపరింటెండెంట్లను బాధ్యులుగా పరిగణిస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం డీఈఓ గోవిందరాజులు మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాలు సీసీ కెమెరాల నిఘాలో తెరిచేలా ఏర్పాట్లు చేశామని, మొత్తం 61 పరీక్షా కేంద్రాల్లో 10,572 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు. వీసీలో రాజశేఖర్‌ రావు, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర శెట్టి, మండల విద్యాధికారులు భాస్కర్‌ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు పెబ్బేరు సంత వేలం

పెబ్బేరు: పట్టణంలోని పుర కార్యాలయ ఆవరణలో శుక్రవారం సంత వేలం నిర్వహించనున్నట్లు పుర కమిషనర్‌ జాన్‌ కృపాకర్‌, చైర్‌పర్సన్‌ కరుణశ్రీ గురువారం తెలిపారు. ఈ సంతకు రాష్ట్రంలోనే గాకుండా ఆంధ్రప్రదేశ్‌, తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా కొనుగోలుదారులు వస్తుంటారు. సంత వేలంతో ఏటా పురపాలికకు రూ.కోట్ల ఆదాయం సమకూరుతుంది. పశువులు, గేదెలు, గొర్రెలు, తైబజార్‌కు వేర్వేరుగా వేలం నిర్వహించనున్నారు. సంతలో ప్రధానంగా పశువులు, గేదేలు, గొర్రెల క్రయ విక్రయాలతో పాటు వ్యవసాయ సామగ్రి, ఇంటి నిర్మాణానికి కావాల్సిన వస్తువులు, కూరగాయాలు, కోళ్లు, తాళ్లు తదితర వ్యాపారులు జోరుగా సాగుతాయి. సంత ద్వారా రూ.కోట్ల ఆదాయం సమకూరుతున్నప్పటికీ సరైన వసతులు, సౌకర్యాలు లేక కొనుగోలుదారులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


- ఇదిలా ఉండగా శుక్రవారం వేలం పాట నిర్వహణకు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. వేలంలో పాల్గొనేవారు పశువుల సంతకు రూ.5 లక్షలు, గొర్రెల సంతకు రూ.4 లక్షలు, తైబజారుకు రూ.3 లక్షల డీడీ, చలాన్‌ తీసుకొని పుర కార్యాలయంలో సమర్పించి రూ.500 చెల్లించి దరఖాస్తు ఫారం పొందాల్సి ఉంటుంది. వేలంలో వందల మంది పాటదారులు పాల్గొంటారు.
- 1984లో రూ.10 వేలతో ప్రారంభమైన సంత వేలం ప్రతి ఏడాది పెరుగుతూ వస్తోంది. 2019–20లో రూ.3.03 కోట్లు, 2020–21లో రూ.3.39 కోట్లు, 2021–22లోరూ.3.60 కోట్లకు కాంట్రాక్టర్‌ దక్కించుకున్నారు. ఈ ఏడాది రూ.4 కోట్లకు చేరువయ్యే అవకాశం ఉంది.

‘ప్రజా’హితం.. ‘సాక్షి’ అభిమతం

నిదర్శనం

ప్రజాశ్రేయస్సే పరమావధిగా పురుడుపోసుకున్న ‘సాక్షి’.. అనతికాలంలోనే తనదైన ముద్ర వేసుకుంది. కుంభకోణాల గుట్టురట్టు చేస్తూ.. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ.. అక్రమార్కులను చీల్చిచెండాడడమే లక్ష్యంగా దూసుకెళ్తోంది. రైతులు, కార్మికులు, విద్యార్థులు.. ఇలా వివిధ వర్గాల సమస్యలను ఎత్తి చూపడంతో పాటు పరిష్కారమయ్యే వరకూ అక్షర పోరాటం కొనసాగిస్తోంది. మానవీయ కథనాలతో పలువురి జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా.. అభివృద్ధికి బాటలు పడేలా నిరంతరాయంగా కృషి చేస్తోంది. పారదర్శకతతో కూడిన విశ్లేషణాత్మక కథనాలతో అందరి మనసులు దోచుకుంది. ‘సాక్షి’ పుట్టుకే సంచలనం కాగా ఏ పాత్ర పోషించినా ప్రతీ కథనం ‘ప్రజా’హితం.. అదే ‘సాక్షి’ అభిమతం. ఈ 15 ఏళ్ల ప్రస్థానంలో ‘సాక్షి’ సాధించిన విజయాలకు నిదర్శనంగా నిలుస్తున్న కొన్ని కథనాలు మరోసారి పాఠకుల కోసం..

ఇదెక్కడి చోద్యం!



వైద్య అధికారి తీరుపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనాలు

ఇదెక్కడి చోద్యం..



నాగర్‌కర్నూల్‌ ఐసీడీఎస్‌ ప్రాజెక్టు పరిధిలో మెడికల్‌ ఆఫీసర్‌గా నియామకమైన ఓ అధికారి ఏడేళ్లుగా ఒక్కరోజు కూడా విధులకు హాజరుకాకుండానే నెలనెలా జీతం తీసుకుంటున్న ఉదంతాన్ని 2021 సెప్టెంబర్‌ 28న ‘ఇదెక్కడి చోద్యం’ పేరిట ‘సాక్షి’ వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్‌ ఉదయ్‌కుమార్‌.. సదరు అధికారిని రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌కు సరెండర్‌ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

‘సాక్షి’ పత్రిక ద్వారా వెలుగులోకి..



ఐసీడీఎస్‌ శాఖలో మెడికల్‌ ఆఫీసర్‌గా నియామకమై పని చేయకుండా ఏడేళ్ల పాటు జీతం తీసుకున్న వైనాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తెచ్చి ప్రచురించింది. దీంతో రూ.లక్షల్లో ప్రజాధనం దుర్వినియోగానికి తెరపడింది. ఎప్పటికప్పుడు నిజాలను వెలుగులోకి తెస్తున్న ‘సాక్షి’ దినపత్రికకు అభినందనలు.

– శ్రీనివాస్‌, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

కార్మికుల జీవితాల్లో వెలుగులు



ప్రస్తుత మున్సిపాలిటీ 2016లో నగరపంచాయతీగా ఉన్న సమయంలో అందులో 58 మంది కార్మికులు పనిచేసేవారు. కార్మికులకు సంబంధించి ప్రావిడెంట్‌ ఫండ్‌(పీఎఫ్‌) జీతాల్లో నుంచి కట్‌ అయిన రూ.30లక్షలు వారి పీఎఫ్‌ ఖాతాల్లో జమ చేయకుండా సిబ్బంది చేతివాటం చూపించారు. దీనిపై 2016 జనవరి 20న ‘పీఎఫ్‌ ఉఫ్‌’ అంటూ కథనాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తీసుకువచ్చింది. వెంటనే స్పందించిన అధికారులు దశలవారీగా కార్మికుల పీఎఫ్‌ సమ్మును వారి ఖాతాల్లో జమ చేశారు.

మూడేళ్లు పోరాడినం



పీఎఫ్‌ అమౌంట్‌ కోసం దాదాపు మూడు సంవత్సరాలపాటు పోరాటం చేసినా కూడా ఫలితం లేకుండా పోయింది. మా బాధలు తెలుసుకున్న ‘సాక్షి’ ఈ వివరాలపై కథనం ప్రచురించడంతో వెంటనే అప్పటి అధికారులు స్పందించారు. మా ఖాతాల్లో పీఎఫ్‌ అమౌంట్‌ను జమ చేశారు. ఈ విషయంలో కృషి చేసిన ‘సాక్షి’ పత్రికకు ధన్యవాదాలు.

– భీముడు, వాటర్‌మెన్‌

అడవి బిడ్డలకు అండగా..

‘సాక్షి’ మద్దతు మరువలేం



అమ్రాబాద్‌ అభయారణ్యం నుంచి అడవి బిడ్డలను తరలించేందుకు మళ్లీ ప్రయత్నాలు మొదలయ్యాయని.. అధికారులు తరుచూ చెంచుపెంటలకు వెళ్తూ.. పక్కా ఇళ్లు కట్టిస్తామని, భారీగా ప్యాకేజీ ఇస్తామని ఒత్తిడి చేస్తున్న విషయాన్ని ‘సాక్షి’ వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని ‘అడవి ఒడి నుంచి విడదీసి’ అనే శీర్షికతో మెయిన్‌ ప్రధాన సంచికలో ప్రచురితమైంది. తమ పోరాటానికి జీవం పోశారని పలువురు చెంచులు సాక్షికి కృతజ్ఞతలు చెప్పారు. ప్యాకేజీలతో అధికారులు ప్రలోభాలను వెలుగులోకి తేవడంతో పాటు తమ బాధలను కళ్లకు కట్టినట్లు చూపించారని చెంచులు, గిరిజనేతరులు, ప్రజాసంఘాల నాయకులు అభినందించారు.

కలకలం రేపిన కాలకూటం

జంతు కళేబరాలతో నూనె తయారు చేస్తున్న ఉదంతంపై 2015 ఫిబ్రవరి 2న ‘సాక్షి’లో కాలకూటం శీర్షికన కథనం ప్రచురితమవగా..జిల్లాలో కలకలం రేపింది. వల్లూరు గ్రామ పంచాయతీ శివారులో గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారంపై ఆ ప్రాంతవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నూనెను డబ్బాలలో ప్యాక్‌ చేసి వివిధ ప్రాంతాలలో విక్రయానికి తరలిస్తారు. దీనిపై మార్చి 3న తహసీల్దార్‌ జగదీశ్వర్‌రెడ్డి, సిబ్బంది అక్కడికి చేరుకొని పూర్తి వివరాలు ఆరా తీశారు. తగు చర్యల నిమిత్తం ఈ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించారు.



కళేబరాలను ఉడికించే పాత్రను పరిశీలిస్తున్న తహసీల్దార్‌ జగదీశ్వర్‌రెడ్డి, తదితరులు

శంకర్‌దాదాలు





‘శంకర్‌దాదాలు’ శీర్షికన సాక్షి ప్రచురించిన కథనం

జిల్లాకేంద్రంలో కొంతమంది అర్హత లేకున్నా వైద్యుల పేరుతో ఆసుపత్రులను నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న తీరుపై 2022 జూలై 13న ‘శంకర్‌దాదాలు’ శీర్షికన వార్తా కథనాన్ని ‘సాక్షి’ ప్రచురించింది. దీనిపై స్పందించిన జిల్లా వైద్యశాఖ అధికారులు జిల్లాకేంద్రంలో అనుమతులు లేకుండా, ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లపై తనిఖీలు చేపట్టి పలు ఆస్పత్రులను సీజ్‌ చేశారు.

పల్లెకు ఫీవర్‌





సీజనల్‌ జ్వరాల తీవ్రతపై సాక్షి కథనం

జిల్లాలో వానాకాలంలో సీజనల్‌ జ్వరాల పంజా విసురుతున్నా, మారుమూల ప్రాంతాలు, గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ, సంబంధిత అధికారుల నుంచి కట్టడి చర్యలు లేకపోవడంతో ‘పల్లెకు ఫీవర్‌’ శీర్షికన 2022 జూలై 27న సాక్షి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అమ్రాబాద్‌ మండలంలోని మారుమూల గ్రామం జంగంరెడ్డిపల్లిలో వైద్య శిబిరాన్ని నిర్వహించి, మందులను అందజేశారు.

ఆస్తి కోసం వంచన..



నాటి ‘సాక్షి’ కథనం

ఆస్తి కోసం తోడబుట్టిన వారిని కాగితాల్లో చంపేసి పట్టా చేసుకున్న ఘటనను 2008, మే 15న ‘సాక్షి’ వెలుగులోకి తీసుకొచ్చింది. కొందరు నాయకులు అధికారులతో కుమ్మక్కై బతికున్న వారిని చనిపోయినట్లు అధికారికంగా పంచనామా తయారుచేసి ఆస్తిని కాజేశారు. పంచనామా ప్రతితో పాటు బతికున్న వారి ఫొటోలతో ‘ఆస్తి కోసం వంచన’ శీర్షికన ప్రచురితమైన కథనం నాడు సంచలనం సృష్టించింది. ఇందుకు అధికారులు స్పందించి అక్రమంగా చేసిన పట్టాను రద్దుచేసి నలుగురు అన్నదమ్ములకు సమానంగా ఆస్తిని పంచి పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు.

‘సాక్షి’ సాయం మరువలేను..



నాడు కార్యాలయాల చుట్టూ తిరిగి ఎందరో అధికారులను సాయం చేయాలని వేడుకున్నా.. ఎవరూ స్పందించలేదు, మాకు జరిగిన అన్యాయాన్ని ‘సాక్షి’ విలేకరికి వివరించగానే స్పందించి పూర్తి వివరాలతో కథనం ప్రచురించారు. ఇందుకు స్పందించిన అధికారులు మాకు న్యాయం చేశారు. ‘సాక్షి’ సాయాన్ని ఎన్నటికీ మరువలేదు. నేటికీ నాటి దినపత్రికను ఇంట్లో దాచుకున్నాను.

– వెంకటేశ్వరాచారి (చిన్న), నాగవరం, వనపర్తి

నెరవేరుతున్న బ్రిడ్జి కల..

జిల్లాలోని పెంట్లవెల్లి నుంచి మల్లేశ్వరం వెళ్లే దారిలో పురాతన లో లెవల్‌ బ్రిడ్జితో వర్షాకాలంలో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 2021 మార్చి 22న ‘కలగానే బ్రిడ్జి నిర్మాణం’ శీర్షికన సాక్షి వార్తాకథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు బ్రిడ్జి నిర్మాణపనులను ప్రారంభించారు. ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణం పూర్తయి చివరి దశ పనులు కొనసాగుతున్నాయి.

ఏళ్లుగా ఇబ్బందులు పడ్డాం..



ప్రతి ఏటా వర్షాకాలంలో మా ఊరి వాగు దాటేందుకు మేమంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వర్షాలు కురిసినప్పుడు మా ఊరి నుంచి పెంట్లవెల్లికి వెళ్లాలంటే సాహసం చేసి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మా ఇబ్బందులను ‘సాక్షి’ వెలుగులోకి తెచ్చింది. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, అధికారుల చొరవతో బ్రిడ్జి నిర్మాణం పూర్తికావచ్చింది. మా సమస్య పరిష్కారానికి కృషి చేసిన ‘సాక్షి’ దినపత్రికకు కృతజ్ఞతలు.

– బాలరాజు, మల్లేశ్వరం, పెంట్లవెల్లి



బ్రిడ్జి నిర్మాణంపై సాక్షిలో ప్రచురితమైన కథనం



మల్లేశ్వరం వద్ద పూర్తికావచ్చిన బ్రిడ్జి నిర్మాణం

రెవెన్యూ లీలలు..



2020, ఫిబ్రవరి 25న ప్రచురించిన కథనం

ఓ ఆర్మీ జవాన్‌ కుటుంబానికి చెందిన 1.10 ఎకరాల వ్యవసాయ భూమిని రెవెన్యూ అధికారులు ఎలాంటి ఆధారాలు లేకుండా రాత్రికి రాత్రి పట్టా మార్పిడి చేశారు. సమాచార హక్కు చట్టానికి ఫిర్యాదు చేయగా.. సంబంధిత అధికారి బదిలీపై వెళ్లారు.. ఇందుకు సంబంధించి రికార్డుల్లో ఎలాంటి ఆధారాలు లేవని.. కనీసం దరఖాస్తు తేదీ కూడా లేదని లిఖిత పూర్వకంగా ఇచ్చారు. వీటి ఆధారంగా ‘సాక్షి’ దినపత్రికలో ‘రెవెన్యూ లీలలు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. నాటి ఆర్డీఓ ఈ కథనాన్ని సుమోటోగా స్వీకరించి ఆర్డీఓ కోర్టులో విచారణ చేపట్టారు. నాలుగు నెలల సుదీర్ఘ విచారణ అనంతరం ఎలాంటి ఆధారాలు లేవని ధ్రువీకరించి పట్టా రద్దుచేసి బాధితుడి పేరునే పట్టా చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీఓ జారీ చేసిన ఉత్తర్వుల్లోనూ 2020, ఫిబ్రవరి 25న ‘సాక్షి’లో ప్రచురించిన కథనాన్ని సుమోటోగా తీసుకున్నట్లు పేర్కొనటం గమనార్హం.

‘సాక్షి’కి సలాం..



ప్రజాప్రతినిధులు, నాయకులు ఎందరు వత్తిడి తీసుకొచ్చినా.. ‘సాక్షి’ దినపత్రిక నాడు మాకు జరిగిన అన్యాయాన్ని ఆధారాలతో బయటపెట్టింది. ఈ కథనం ఆధారంగానే మా భూమి మాకు వచ్చింది. ‘సాక్షి’కి సలాం. సమాజంలో పత్రికల పాత్ర చాలా గొప్పది.

– మహేష్‌, ఆర్మీ జవాన్‌, తాడిపర్తి, గోపాల్‌పేట

సీఐ హనుమంతుపై వేటు



గద్వాల టౌన్‌ సీఐ సస్పెన్షన్‌

గద్వాలలో 2018 నుంచి సీఐగా విధులు నిర్వర్తిస్తున్న హనుమంతుపై ఆది నుంచి అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈక్రమంలో గద్వాలలో రేఖా రైస్‌ మిల్లు వ్యవహారంలో చట్టవిరుద్ధమైన, పలు సివిల్‌ తగాదాల్లో తలదూర్చి అవినీతికి పాల్పడడంపై ‘సాక్షి’ వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై అప్పటి ఐజీ స్టీఫెన్‌ రవీంద్ర విచారించారు. ఆరోపణలు నిర్ధారణ కావడంతో సీఐ హనుమంతుపై సస్పెన్షన్‌ వేటు వేశారు.

ర్యాలంపాడుకు బీటలు



నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా ధరూరు మండలం ర్యాలంపాడు వద్ద 4 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ర్యాలంపాడు జలాశయం నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో జలాశయం ఆనకట్టకు బీటలు వారాయి. ఈ అంశాలపై 2021 ఆగస్టు 23వ తేదీన ‘ర్యాలంపాడుకి బీటలు’ అనే శీర్షికన ‘సాక్షి’ కథనాన్ని ప్రచురించడంతో రాష్ట్ర ఇరిగేషన్‌ శాఖ అధికారులు స్పందించారు. సీఈ ఆధ్వర్యంలో సమీక్షించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి బీటలపై సర్వే చేయించారు.

భూదందా





భూందా పై కథనం

గద్వాల పట్టణంలో సుమారు రూ.50 కోట్ల విలువ గల పీజేపీ భూమిని కాజేసేందుకు అక్రమార్కులు యత్నించగా ఈ వ్యవహారంపై 2021 జనవరి 13వ తేదీన ‘భూదందా’ అనే శీర్షికతో ‘సాక్షి’ వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం విజిలెన్స్‌ ద్వారా విచారణ చేపట్టి.. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంది.

ప్రాణాలతో చెలగాటం





అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు న్యూట్రిషన్‌ జ్యూస్‌ పేరిట గొలుగు కట్టు దందాకు తెరలేపారు. దీనిపై ‘సాక్షి’ 2022 జూన్‌ 7వ తేదీన ‘గొలుసుకట్టు దందా’ అనే శీర్షికతో దందా వివరాలు వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో జూన్‌ 9వ తేదీ 2022న పట్టణంలోని అన్ని న్యూట్రిషన్‌ సెంటర్లపై వైద్యారోగ్య శాఖ అధికారులు దాడులు నిర్వహించి న్యూట్రిషన్‌ జ్యూస్‌ ప్రోడక్టులను స్వాధీనం చేసుకున్నారు.

న్యూట్రిషన్‌ జ్యూస్‌పై సాక్షి కథనం

కలకలం రేపిన ‘డర్టీపిక్చర్‌’





డర్టీపిక్చర్‌పై సాక్షి వరుస కథనాలు

గద్వాలలో కొందరు పలుకుబడిన వ్యక్తులు.. అమాయక మహిళలను లోబర్చుకొని న్యూడ్‌కాల్స్‌తో ఇబ్బందులకు గురిచేశారు. ఈ వ్యవహారంపై ‘సాక్షి’ వరుస కథనాలు ప్రచురించింది. ఇందులో నిందితులకు కొమ్ముకాసిన పట్టణ ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డిపై బదిలీ వేటు వేశారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

నాగర్‌కర్నూల్‌: వేసవి దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ పి.ఉదయ్‌కుమార్‌ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జనాభా ఆధారంగా కావాల్సిన నీరు లభ్యత ఉందా తదితర వివరాలను పంచాయతీలు, మున్సిపాలిటీ వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో 811.80ఫీట్లకుగాను ప్రస్తుతం 35.370 టీఎంసీల నీటి లభ్యత ఉందని, ఇది 25 టీఎంసీల వరకు తగ్గితే జలాశయం నుంచి లిఫ్ట్‌ చేయడం ఇబ్బంది అవుతుందని, సాగర్‌ జలాల నుంచి రివర్స్‌ పంపింగ్‌ ద్వారా శ్రీశైలం జలాశయానికి పంపిస్తే తాగునీటికి వాడుకోవచ్చని అన్నారు. ప్రతిరోజు తాగునీటి కోసం జిల్లాలో 0.6టీఎంసీల నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఆర్‌డబ్ల్యూఎస్‌ ఈఈ సుధాకర్‌ సింగ్‌ కలెక్టర్‌కు వివరించారు. అధికారులు తనిఖీలు నిర్వహించి తాగునీటి సమస్య తలెత్తే ప్రాంతాలు, ఏఏ మరమ్మతులు చేపట్టాలి, తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు తదితర వాటిపై నివేదికలు అందజేయాలని కలెక్టర్‌ ఆదేశించారు.

ఎండల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

ఈ ఏడాది తీవ్రమైన ఎండలు ఉన్నందున వడదెబ్బలకు అన్ని పీహెచ్‌సీలలో వైద్యసేవలను ఏర్పాటు చేయాలని, రద్దీ ప్రాంతాలలో నీడనిచ్చేలా గ్రీన్‌మ్యాట్‌, చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ ఆదేశించారు. ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షాల వల్ల ఆస్తిపంట నష్ట వివరాలను తెలియజేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారులు,



మాట్లాడుతున్న కలెక్టర్‌ పి.ఉదయ్‌కుమార్‌

ఆర్డీఓలు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకాకపోవడంతో కలెక్టర్‌ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మనూచౌదరి, మోతీలాల్‌, డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్‌, డీపీఓ కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఈఈ సుధాకర్‌సింగ్‌, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే, ఈనెల 24వ తేదీన ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో క్షయ వ్యాధి నివారణ కోసం అవగాహన పోస్టర్‌ను కలెక్టర్‌ ఆవిష్కరించారు. అనంతరం కొల్లాపూర్‌ చౌరస్తాలోని నూతన కలెక్టరేట్‌ ప్రాంగణంలో పనులను కలెక్టర్‌ పరిశీలించారు. ప్రాంగణంలో పండ్లు, పూలు, నీడనిచ్చే మొక్కలను విరివిగా నాటాలని అన్నారు.

100 రోజులు పనిదినాలు కల్పించాలి

కందనూలు: జాతీయ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు 100 రోజుల పని దినాలు కల్పించాలని కలెక్టర్‌ పి.ఉదయ్‌కుమార్‌ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎండల దృష్ట్యా పని ప్రదేశంలో నీరు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. హరితహారం, నర్సరీలు, బృహత్‌ పల్లె, ప్రకృతి వనాలలో మొక్కలను పర్యవేక్షించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సబ్సిడీ రుణ లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

చేపల వలలో చిక్కుకుని వ్యక్తి మృతి

పాన్‌గల్: చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని కేతేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మినిగ స్వామి(57) గ్రామ సమీపంలోని గుండ్ల చెరువులో చేపల వేటకు బుధవారం సాయంత్రం వెళ్లాడు. వేసిన వలను తీసే క్రమంలో వలలో చిక్కుకుని నీటిలో మునిగిపోయాడు. ఇంటికి తిరిగి రాక పోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గురువారం చెరువు పరిసరాల్లో పరిశీలించారు. చెరువు కట్టపై దుస్తులు కనిపించగా మనిషి కనిపించకపోవడంతో నీటిలో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహన్ని బయటకు తీశారు. మృతుడి కుమారుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

అనారోగ్య సమస్యతో ఆత్మహత్య


మినిగ స్వామి (ఫైల్)

మండలంలోని శాగాపూర్‌లో అనారోగ్య సమస్యతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తెలుగు పెద్ద కృష్ణయ్య(58) గతకొంత కాలంగా నరాల సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

ముంబయిలో వలస కూలీ మృతి

గండేడ్: మండలంలోని వెన్నాచెడ్ చెందిన మైసగళ్ల భీమయ్య(55) ఉపాధి నిమిత్తం ముంబయికి వలస వెళ్లాడు. 30ఏళ్లుగా మీరారోడ్డులో మేస్త్రీగా పనిచేస్తున్నాడు. నెలరోజుల క్రితం గ్రామానికి వచ్చిన ఇతను ఇటీవలే తిరిగి వెళ్లాడు. గురువారం మధ్యాహ్నం మీరా రోడ్డులోని 13వ అంతస్తులో భవన నిర్మాణ పనుల్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో పని ముగించుకుని భోజనం కోసం కిందకు దిగే క్రమంలో ప్రమాదావశాత్తు 13వ అంతస్తు నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది.

బెంగళూరులో కొండాపూర్ వాసి మృతి

నవాబుపేట: బతుకుదెరువు కోసం మండల వాసి బెంగళూరు వెళ్లి మృతి చెందాడు. మండలంలోని కొండాపూర్ చెందిన చెంచు రాములు(32) తన భార్య అంజమ్మ, నలుగురు పిల్లలతో కలిసి బెంగళూర్‌కు పనుల కోసం వలస వెళ్లాడు. బుధవారం ఉగాదిని పండుగ ఉండడంతో ఇంట్లోనే ఉండగా, అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతి చెందినట్లు భార్య కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహం కోసం బెంగుళూరు వెళ్లి శుక్రవారం వరకు తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేశారు.

దివ్యాంగుడు అదృశ్యం


రహమత్ అలీ

ఊట్కూర్: మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు రహమత్ అలీ నాలుగు రోజులుగా కనపడడంలేదని గురువారం కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంతల్‌వీధికి చెందిన ఈయన గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ చూసి వస్తానని ఇంట్లో చెప్పివెళ్లాడు. తిరిగి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకి తెలిసిన వారు 9963897258, 7396736997 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళ మెడలోని పుస్తెలతాడు అపహరణ

జడ్చర్ల: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో ఉన్న పుస్తెలతాడును గుర్తు తెలియని ఇద్దరు దుండగులు ఎత్తుకెళ్లిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన శ్రీలత ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. విధులు ముగించుకుని మార్కెట్ సమీపంలోని శ్రీరాంమందిర్ ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా బాదేపల్లిలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు బైక్‌పై హెల్మెట్లు ధరించి, దగ్గరగా వచ్చి మెడలో ఉన్న పుస్తెలతాడును తెంచుకుని పారిపోయారు. ఇది మూడు తులాలు ఉందని బాధితురాలు వాపోయింది. విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాకింగ్ చేసి వస్తుండగా..

మహబూబ్‌నగర్ క్రైం: రూరల్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో మహిళ మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించారు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీకి చెందిన మల్లు ప్రమీలమ్మ గురువారం రాత్రి కాలనీలో ఉన్న పార్క్‌లో వాకింగ్ చేసి బయటకు వస్తుంగా, ఇద్దరూ బైక్‌పై వచ్చి మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. మాస్క్ ధరించడం వల్ల గుర్తించలేకపోయానని బాధితురాలు తెలిపింది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


అవగాహనతో అరికడదాం

- పెరుగుతున్న క్షయ రోగులు
- చిన్నారులను కలవరపెడుతున్న వైనం
- జిల్లాలో 2,142 క్షయ బాధితులు
- నేడు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

పాలమూరు: క్షయ నివారణ కట్టడి కోసం జిల్లా అధికారులు ప్రయత్నిస్తున్నా మరోవైపు రోగులు క్రమంగా పెరగడం ఆందోళన కలిగిస్తుంది. ఇటీవల చిన్నారుల్లోనూ ఈ వ్యాధి అధికంగా సోకుతుంది. ఏడాది కేటాయించిన లక్ష్యంలో భాగంగా బాధితులను గుర్తించడానికి ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం క్షయ నివారణకు వైద్య సేవలు విస్తరిస్తున్నా.. క్షేత్రస్థాయిలో వ్యాధి, చికిత్స విధానాలపై అవగాహన కల్పిస్తూ కొత్తగా క్షయ బారిన పడకుండా చూస్తున్నారు. గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో 1,403 మందిని గుర్తించాలని లక్ష్యం కేటాయించగా, 1,471 మందిని గుర్తించారు. ఇక ప్రైవేట్‌లో 468మందిని గుర్తించాలని ఉండగా 276మందిని గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి 23వరకు జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో 315మందిని గుర్తించాలని ప్రభుత్వం లక్ష్యం కేటాయించగా, జిల్లా క్షయ నియంత్రణ అధికారులు 307మందిని గుర్తించారు. ప్రైవేట్ ఆస్పత్రుల పరిధిలో 105 లక్ష్యం ఉంటే 88మందిని గుర్తించారు. ఇందులో 1,750 మందికి ఆరు నెలల పాటు పోషణ కోసం రూ.500 ఇస్తున్నారు.

సరైన చికిత్స తీసుకోకుంటే..

క్షయకు సరైన చికిత్స తీసుకోకుంటే ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్లే అవుతుంది. ఈ వ్యాధి మనిషిని పూర్తిగా బలహీనుడిగా మార్చేస్తుంది. ఒకరి నుంచి మరొకరికి సోకే ఈ వ్యాధి పేరు వింటేనే ఆందోళనకు గురవుతుంటారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఇది మరింత సులువుగా సోకుతుంది. ఈ వ్యాధి ఉన్న వ్యక్తి దగ్గితే 40వేల వరకు వ్యాధికారక క్రిములు గాల్లో కలుస్తాయి. ఈ గాలి ద్వారా అవి ఆరోగ్యవంతుల శరీరంలోకి చేరితో వారిలో రోగ నిరోధక శక్తి తగ్గి క్షయగా మారే ప్రమాదం ఉంది.



మహమ్మారిలా విస్తరణ

క్షయ నివారణకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా అది మహమ్మారిలా విస్తరిస్తూనే ఉంది. ఈ వ్యాధిని సమూలంగా నివారించాలంటే ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యం సహకరించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఇటీవల 'సవరించిన క్షయ చికిత్స విధానం' అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రైవేట్ వైద్యులు క్షయ బాధితుడిని గుర్తిస్తే, అతడికి పూర్తి స్థాయిలో వైద్యం అందించినా ప్రోత్సాహక నగదును అందిస్తున్నారు. అయినా ప్రైవేట్ వైద్యుల నుంచి సహకారం లేకపోవడంతో పాటు బాధితుల సంఖ్య ఏటా పెరుగుతుంది. ప్రజల్లో అవగాహన లేకపోవడం, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం, దీర్ఘకాలంలో చికిత్స తీసుకుంటే తేలికే కాని కొందరు నిర్లక్ష్యంగా చికిత్సకు దూరంగా ఉంటున్నారు. దీంతో వ్యాధి తగ్గుముఖం పట్టడం లేదు.

టీబీ యూనిట్	రోగుల సంఖ్య
మహబూబ్‌నగర్	770
కోయిలకొండ	482
బాదేపల్లి	428
భూత్పూర్	462

వ్యాధిని గుర్తించడం ఇలా..

రెండు వారాలకు మించి ఎడతెరపి లేకుండా దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, దగ్గినప్పుడు రక్తం పడటం వ్యాధి లక్షణాలు. సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్తే ఉచితంగా తెమడ పరీక్షలు చేసి వ్యాధిని గుర్తిస్తారు.


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

శిబిరాలు నిర్వహిస్తున్నాం



జిల్లాలో కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన 'క్షయ ఓడిపోవాలి-దేశం గెవాలి 2025' నినాదంలో భాగంగా జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ఏసీఎఫ్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. పది రోజుల పాటు జ్వరం, రెండు వారాల పాటు దగ్గు, రాత్రి వేళలో చెమట ఉన్న వారికి తేమడ పరీక్షలు చేస్తున్నాం. దీంట్లో పాజిటివ్ వస్తే ఆ తర్వాత సీబీనాట్ పరీక్ష చేసి దాంట్లో పాజిటివ్ వస్తే ఆరు నెలల పాటు మందులు వాడాలి. దగ్గు, జ్వరం రెండు వారాల పాటు క్రమం తప్పకుండా రావడం బరువు తగ్గుతున్నట్లు అనిపిస్తే తేమడ పరీక్ష చేసుకోవాలి. అన్ని పీహెచ్‌సీలలో తెమడ పరీక్షలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. పొగాకు ఉత్పత్తి ఏరియాలో కొంత జాగ్రత్తగా ఉండాలి.

– రఫీక్, జిల్లా క్షయనియంత్రణ అధికారి

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు

జడ్చర్ల టౌన్: తోటి విద్యార్థులతో గొడవ కారణంగా స్థానిక కస్తూర్బా మైనార్టీ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థి మదీహ బుధవారం రాత్రి 11:30గంటల ప్రాంతంలో ఫినాయిల్ తాగింది. గమనించిన తోటి విద్యార్థులు విధుల్లో ఉన్న ఏఎన్‌ఎం, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వటంతో అక్కడే ప్రాథమిక చికిత్స అందించి బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థికి ఎలాంటి ప్రాణాపాయం లేదని డా. సూర్య తెలిపారు. ఏఎన్‌ఎం మహమూదాబేగం ఘటనపై స్పందిస్తూ.. మహబూబ్‌నగర్‌కు చెందిన మదీహ తోటి విద్యార్థుల దుస్తులు తీసి దాచిపెట్టిందని ఆరోపించుకుంటూ గొడవ పడ్డారు. విషయం తెలియగానే బుధవారం ఉగాది పండుగ కారణంగా స్టడీఅవర్ నిర్వహించకుండా పదో విద్యార్థులను రాత్రి 11గంటల వరకు కూర్చోబెట్టి మాట్లాడి సముదాయించినట్లు తెలిపారు. ఆ తర్వాత ఏమైనా ఉంటే ఉదయం మాట్లాడదామని నచ్చచెప్పి గదుల్లోకి పంపించామన్నారు. అయితే వాష్‌రూంకని వెళ్లిన మదీహ అందులో ఉన్న ఫినాయిల్ తాగుతుండగా ఇతర విద్యార్థులు గుర్తించి సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. వెంటనే ఫినాయిల్ బాటిల్ లాగేసుకున్నట్లు తెలిపారు. విధుల్లో ఉన్న ఉపాధ్యాయురాలితో కలసి రాత్రి 12గంటల ప్రాంతంలో బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఇదే విషయమై ఎస్‌ఓ సబస్సుమ్ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య తగాదాల వల్లే ఫినాయిల్ తాగేందుకు యత్నించిందని తెలిపారు. ఘటనపై బాధిత విద్యార్థిని మదీహ మాట్లాడుతూ తనపై ఐదుగురు విద్యార్థులు దొంగతనం మోపుతున్నారని, తన దుస్తులు, డబ్బులు లాకుంటున్నారని అందుకే మనస్థాపం చెంది ఫినాయిల్ తాగినట్లు తెలిపింది. ఘటనకు సంబంధించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించటంతో గురువారం తల్లి ఆస్పత్రికి చేరుకుంది. విద్యార్థిని ప్రస్తుతం ఆస్పత్రిలో కోలుకుంటుంది.

వైద్యుల నిర్లక్ష్యంతో ఆటో డ్రైవర్ మృతి


దౌలత్ (ఫైల్)

గద్వాల క్రైం: అనారోగ్యంతో జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేరిన ఓ ఆటో డ్రైవర్ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా.. పట్టణంలోని మోమిన్‌మహల్లా కాలనీకి చెందిన దౌలత్ (39) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 21వ తేదీన అనారోగ్యంతో పాటు మల, మూత్ర సమస్యతో జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. గురువారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం, సకాలంలో వైద్యులు స్పందించకపోవడంతో దౌలత్ మృతి చెందాడని బంధువులు చెబుతూ ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని సూపరిండెంట్ కిషోర్‌కుమార్, వైద్యులతో మాట్లాడారు. రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం పరిపాటిగా మారిందని, పని తీరు మార్చుకోవాల్సిందిగా హెచ్చరించారు. దైవ సమానులుగా భావించి రోగులు ఇక్కడి వచ్చిన క్రమంలో వైద్యులు తీసుకుంటున్న చర్యలతో ఆస్పత్రికి చెడ్డ పేరుతో పాటు మీపై శత్రుత్వం పెంచేలా చేసుకోవడం మంచిదికాదన్నారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. మల, మూత్రం రాక బాధపడుతున్న దౌలత్‌కు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాం. సీటీ స్కాన్‌లో ఎలాంటి ప్రతికూల ఫలితం రాలేదు. గురువారం తెల్లవారుజామున గుండెపోటుకు గురికావడంతో మృతి చెందాడని, వైద్యుల నిర్లక్ష్యం లేదన్నారు. మృతుని బంధువుల ఆరోపణ నేపథ్యంలో కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆదేశాల మేరకు మృతుడికి వైద్య సేవలు అందించిన భార్గవ వ్యాస్‌కు మూడు రోజుల్లో వివరణ ఇవ్వాల్సిందిగా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య హసీనా, ఇద్దరు కుమారులు ఉన్నారు.


మృతికి గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

పర్యాటకంగా మన్యంకొండ అభివృద్ధి

- త్వరలో రోప్ వే పనులు ప్రారంభం
- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ దేవాలయం వద్ద రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నిర్మించతలపెట్టిన రోప్ వే పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రోప్ వే పనులకు సంబంధించి పర్యాటక శాఖ చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ, కోల్‌కత్తా, ముంబాయికి చెందిన రోప్ వే నిపుణులతో కలిసి మంత్రి పరిశీలించారు. కొండ దిగువన అలివేలు మంగ దేవాలయం, మెయిన్ రోడ్డుకు కుడి వైపు నుంచి కొండపైకి సుమారు కిలోమీటరు మేర రోప్ వే నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. దీంతో పర్యాటకులు, భక్తుల సంఖ్య మరింతగా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా సకల సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. ఎంత ఖర్చు అయినప్పటికీ పేదల తిరుపతి మన్యంకొండను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మంత్రి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, పర్యాటకశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, ఆలయ చైర్మన్ మధుసూదన్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.


రోప్ వే స్థల పరిశీలన చేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, అధికారులు

నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులపై దృష్టి

నారాయణపేట రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన రైతులను మోసం చేయడానికి ప్రయత్నం చేస్తున్న వారిని ఒక కంట కనిపెట్టాలని ఎస్పీ వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి జాన్‌సుధాకర్‌తో కలిసి జిల్లా పోలీసులు, వ్యవసాయశాఖ మండల అధికారులకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులను విక్రయించేందుకు వస్తున్న దళారులను పట్టుకోవాలని, ముందస్తుగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని రకాల సీడ్, ఎరువుల దుకాణాల లైసెన్స్‌లను తనిఖీ చేయాలని, లోకల్ డీలర్లపై దృష్టి సారించాలన్నారు. గతంలో నమోదైన కేసులకు సంబంధించిన వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కర్ణాటక నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేయాలని, బార్డర్ చెక్‌పోస్టులు పటిష్టంగా పనిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, పెండింగ్ కేసుల దర్యాప్తుపై చర్చించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు శ్రీకాంత్‌రెడ్డి, సీతయ్య, జనార్దన్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

కుమారులు పోషించడం లేదని.. తల్లి ఆత్మహత్య

వీపనగండ్ల: నలుగురు కుమారులు, కూతురు ఉన్నా తన ఆలన పాలన చూసుకోవడం లేదని మండల కేంద్రానికి చెందిన కొండా సరోజమ్మ గురువారం తన ఒంటికి నిప్పంటించుకుంది. నలుగురు కుమారుల్లో ఇద్దరు కుమారులు, కుమార్తె మండల కేంద్రంలోనే ఉన్నారు. మరో ఇద్దరు కుమారులు తమ భార్యల గ్రామాలలో నివాసం ఉంటున్నారు. నలుగురు కుమారుల్లో పెద్దకుమారుడు కృష్ణమూర్తి ఇదే గ్రామంలో మెడికల్ షాపు నిర్వహిస్తుండగా, రెండో కుమారుడు చంద్రశేఖర్‌శెట్టి పూర్తిగా అంధుడు. తల్లిని పోషించడంలో గొడవపడ్డ కుమారులు తల్లిని కూతురి పాత గృహంలో ఒంటరిగా ఉంచారు. ప్రతి రోజు భోజనాన్ని కూడా ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న సరోజమ్మ తాను బతికి ఏం లాభమని జీవితంపై విరక్తి చెంది ఒంటిపై నిప్పంటించుకుంది. చుట్టుపక్కల వారు చూసి మంటలను ఆర్పి స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన తర్వాత వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని సందర్శించి పూర్తి వివరాలను పోలీసులు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపారు.

వ్యవసాయ సామగ్రి దగ్ధం

బల్మూర్: అగ్ని ప్రమాదంలో వ్యవసాయ సామగ్రి కాలి బూడిదైంది. మండలంలోని నర్సాయపల్లి శివారులో గురువారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చెలరేగి చుట్టుపక్కల గడ్డి అంటుకుంది. ఆ ప్రాంతమంతా మంటలు వ్యాపించడంతో వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న పైపులు, స్ప్రింకర్లు, కేబుల్‌వైర్లు కాలి బూడిదైనట్లు రైతులు మూడవత్‌సాలి, రామావత్ గోపాల్, రాయుడు, వెంకట్రాములు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ సమస్య కారణంగానే తరుచూ మంటలు వస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతోనే అగ్ని ప్రమాదం చోటు చేసుకుందని వాపోయారు. విద్యుత్ శాఖ నుంచి తమకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి


చిట్టి (ఫైల్)

బాలానగర్: వివాహిత మృతిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పంచాంగులగడ్డ తండాకు చెందిన కేతావత్ చిట్టి (26) ఏడేళ్ల క్రితం మండలంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న తోటి కార్మికుడు కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లా మాన్వికి చెందిన శివకుమార్ ఇద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. గత నెలలో చిట్టి తండ్రి దాస్య మృతి చెందడంతో అంత్యక్రియలకు వచ్చి భర్త వేధిస్తున్నాడని కుటుంబ సభ్యులకు తెలిపిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా గురువారం చిట్టి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని భర్త శివకుమార్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. తాము అక్కడికే వస్తామని చెప్పినా వినకుండా, కారులో మృతదేహాన్ని పంచాంగులగడ్డ తండాకు తీసుకువచ్చాడు. దీంతో చిట్టి మృతిపై అనుమానాలు ఉన్నాయని సోదరుడు సురేష్ అలియాస్ సూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కర్ణాటకలో జేడీఎస్ గెలుపు ఖాయం

- కర్ణాటక ఎన్నికల ప్రచారంలో పేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న పేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: కర్ణాటకలో జరిగే ఎన్నికల్లో ఈ సారి జేడీఎస్ జెండా ఎగరబోతోందని, కుమారస్వామి ముఖ్యమంత్రి కావడం ఖాయమని జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా యాదగిరి జిల్లా ఏరిగొడే ప్రాంతంలో జేడీఎస్ అభ్యర్థి శరణుగౌడ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామితో పాటు కార్యక్రమంలో పాల్గొన్నారు. 50 ఏళ్ల పాలన అందించిన కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ కార్డు ఇస్తుందంటా, అది నమ్మి ఓట్లు వేస్తారా అని ప్రశ్నించారు. ఆ పార్టీ పని అయిపోయిందని అన్నారు. రూ.70 ఉన్న పెట్రోల్ ను రూ. 112, సిలిండర్ ధరను రూ. 1200 వరకు పెంచిన బీజేపీకీ ప్రజలు గుణపాఠం చేప్పేందుకు సిద్ధంగాగా ఉన్నరన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ చేపడుతున్న ప్రజాసంక్షేమ పథకాలు కర్ణాటకలో సైతం అమలు చేసేందుకు జేడీఎస్ నేత కుమార స్వామి సిద్ధంగా ఉన్నారన్నారు. 2018లో ఎమ్మెల్యేగా నాగన్‌గౌడ్ మాదిరిగానే ఈ సారి ఆయన కుమారుడు శరణుగౌడను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

మత్తు పదార్థాలకు బానిసై యువకుడి ఆత్మహత్య


విదిన్‌సింగ్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: మత్తు పదార్థాలకు బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పాత పాలమూరుకు చెందిన విదిన్‌సింగ్(26) గురువారం రాత్రి పట్టణంలోని బోయపల్లి గేట్ సమీపంలో తుంగభద్ర రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కొన్ని రోజులుగా డ్రగ్స్, మద్యం ఇతర చెడు అలవాట్లకు బానిసైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చెరువులో మృతదేహం లభ్యం

హన్వాడ: మండల కేంద్రంలోని పెద్దచెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గురువారం ఉదయం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పెద్దచెరువులో గుర్తు తెలియని 35నుంచి 40 వయస్సు గల వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి శరీరంలో ఎలాంటి ఆనవాలు లభ్యం కాలేదు. స్థానిక పంచాయతీ కార్యదర్శి దీప్తి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ ముస్తాక్‌అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే 87126 59339 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కొత్త కోర్సుల్లో శిక్షణ ఇవ్వండి


మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

పాలమూరు: గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ద్వారా కొత్త కోర్సులలో అభ్యర్థులకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ రవినాయక్ అధికారులను సూచించారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఆర్‌ఎస్‌ఈటీఐ ద్వారా 26 కార్యక్రమాలను నిర్వహించి, 687 మందికి శిక్షణ ఇచ్చినట్లు డైరెక్టర్ డీఎస్‌కే ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. 2023– 24 సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. 26 కార్యక్రమాలలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించగా, 690 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. పార్మ్రీ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ బాబురావు తెలిపారు. మహబూబ్‌నగర్ బండమీది పల్లెల్లో ఉన్న ఎస్‌బీఐ శిక్షణా కేంద్రం ద్వారా మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్ నిర్వహణ, లైట్ మోటార్ వెహికల్ ఓనర్ డ్రైవింగ్, సీసీ కెమెరాల నిర్వహణ, బైక్ మెకానిక్, వస్త్ర, చిత్రకళ తదితర రంగాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఓ యాదయ్య, జిల్లా పరిశ్రమల మేనేజర్ బాబురావు, నాబార్డు డీడీఎం ఎంవీఎస్‌ఎస్ శ్రీనివాస్, ఎస్‌బీఐ ఏజీఎం శ్రవణ్ కుమార్‌రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కాల్వ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించండి

కలెక్టర్ రవినాయక్

వివిధ పథకాల కింద 2022 సంవత్సరానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను ఆదివారం నాటికి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధరణి, ప్రజావాణి, ఈ-ఆఫీస్, పెండింగ్ స్లాట్, విద్యార్థులకు ధ్రువపత్రాలు జారీ, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా లేకుండా చేయాలని, ఎట్టి పరిస్థితులలో ఆయా మండలాలలో తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న భూముల సర్వేకి సంబంధించి దరఖాస్తులను పరిష్కరించాలని సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావును ఆదేశించారు. పట్టణ గృహ లబ్ధిదారుల వివరాలకు సంబంధించి 1,530 పేర్లను అప్‌లోడ్ చేయాల్సిందని దీనిపై ప్రత్యేక దష్టి కేంద్రీకరించాలని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద తహసీల్దార్ల స్థాయిలో 74, శాసనసభ్యుల అనుమతి కోసం 544 పెండింగ్‌లో ఉండగా వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు, ఆర్డీఓ అనిల్‌కుమార్, గృహ నిర్మాణ శాఖ ఈఈ భాస్కర్, పంచాయత్ రాజ్ అధికారి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఒకరిద్దరి తప్పిదాన్ని వ్యవస్థకు ఆపాదించొద్దు

మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సరీ్వస్ కమిషన్ ప్రశ్నపత్రాల అంశంలో మంత్రి కేటీఆర్‌పై విపక్షాలు బురద చల్లడం సరికాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం వాస్తవాలు తెలుసుకోకుండా ప్రతిపక్ష నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గురువారం శాసనమండలిలో తన చాంబర్‌లో మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. పేపర్ లీకేజీ ఘటనలో ఒకరిద్దరి తప్పిదాన్ని మొత్తం వ్యవస్థకు ఆపాదించడం సరికాదన్నారు. టీఎస్‌పీఎస్సీ పారదర్శకంగా ఉండాలన్నదే సీఎం కేసీఆర్ ఉద్దేశమని, ఎనిమిదేళ్లుగా ఎలాంటి తప్పులకు తావులేకుండా సంస్థ పనిచేస్తోందన్నారు. సీబీఐ విచారణ చేయాలని తప్పుడు వాదన చేస్తూ పోలీసు వ్యవస్థను తక్కువ చేసి మాట్లాడటం సరి కాదన్నారు. 'సిట్'విచారణలో బాధ్యులకు శిక్ష పడుతుందని సుఖేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీలో పాసైన పది బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ పెండింగ్‌లో పెట్టడంతో పాలనకు ఆటంకం కలుగుతోందని విచారం వ్యక్తం చేశారు. బిల్లులకు సవరణలు ఏవైనా ఉంటే ప్రభుత్వానికి సూచించి ప్రజల అవసరాలు తీర్చేవిధంగా, చట్టసభల గౌరవాన్ని కాపాడేవిధంగా గవర్నర్ వ్యవహరించాలని సూచించారు. దర్యాప్తు సంస్థలతో రాష్ట్రాల నాయకత్వాన్ని కేంద్రం వేధిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో అధిపత్యం కోసమే రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తున్నారన్నారు.

16.8 కోట్ల మంది డేటా చోరీ!

▶ మొదటి పేజీ తరువాయి

డేటా చోరీకి పాల్పడుతున్న ఓ ముఠా గుట్టును సైబర్‌క్రైం పోలీసులు రట్టు చేశారు. దేశవ్యాప్తంగా 16.80 కోట్ల మందికి చెందిన వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని దొంగిలించి విక్రయిస్తున్న కేటుగాళ్ల ఆటకట్టించారు. ఢిల్లీ శివార్లలోని నోయిడా కేంద్రంగా ఈ దందా సాగిస్తున్న ముఠాలోని ఏడుగురు సభ్యులను అరెస్టు చేశారు. గురువారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఈ కేసు వివరాలను వెల్లడించారు. రక్షణ శాఖలోని వివిధ హోదాల్లో పనిచేసే అధికారులు, నీట్ విద్యార్థులు, డీమ్యాట్ ఖాతాదారులు, ఐటీ సంస్థల ఉద్యోగులు, వాట్సాప్, ఫేస్‌బుక్ వినియోగదారులు, టెలికం, ఫార్మా కంపెనీలు, సీబీఎస్ఈ 12వ తరగతి విద్యార్థుల డేటా సహా మొత్తం 140 కేటగిరీలకు చెందిన సమాచారాన్ని నిందితులు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. రక్షణ శాఖకు చెందిన (డిఫెన్స్ ఫోర్స్ ఢిల్లీ ఎన్‌సీఆర్ డేటాబేస్)కు చెందిన 2.55 లక్షల మంది డేటా సైతం చోరీకి గురికావడంతో దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డేటా చోరీలో జస్ట్ డయల్ అనే సెర్చ్ ఇంజన్ పాత్ర ఉందని, ఈ కేసులో ఆ సంస్థ వారినీ విచారిస్తామని ఆయన పేర్కొన్నారు.

నిందితులు వీరే...

యూపీ పరిధిలోకి వచ్చే నోయిడాలో డేటా మార్ట్ ఇన్ఫోటెక్, గ్లోబల్ డేటా ఆర్ట్స్, ఎంఎస్ డిజిటల్ గ్రో అనే కంపెనీల (కాల్‌సెంటర్లు) ద్వారా నిందితులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. ప్రధాన నిందితుడు ఏ1 కుమార్ నితీష్ భూషణ్‌తోపాటు టెలికాలర్ కుమారి పూజ, డేటా ఎంట్రీ ఆపరేటర్ సుశీల్ తోమర్, క్రెడిట్ కార్డుల డేటా విక్రయించే అతుల్ సింగ్, ఎంఎస్ గ్రో కంపెనీలో సేకరించిన డేటాను విక్రయించే ముస్కాన్ హసన్, గ్లోబల్ డేటాఆర్ట్స్‌లో జస్ట్ డయల్ ద్వారా డేటాను విక్రయించే సందీప్ పాల్, బల్క్ మెసేజ్‌లు పంపే జియా ఉర్ రెహమాన్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 12 సెల్ ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 సీపీయూలు, 140 కేటగిరీలలో డేటా చోరీ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయా కార్యాలయాల్లో ప్రజల పాన్, మొబైల్, టెలికం, ప్రభుత్వ ఉద్యోగులు, రక్షణ శాఖ, పెట్రోలియం కంపెనీలు, బ్యాంకుల డేటా, వాట్సాప్, ఫేస్‌బుక్ యూజర్ల డేటాను పోలీసులు కనుగొన్నారు. నిందితులు ఇప్పటివరకు సుమారు 100 మంది సైబర్ క్రిమినల్స్‌కు డేటాను విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందని స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. అలాగే 50 వేల మంది పౌరులకు చెందిన సమాచారాన్ని కేవలం రూ. 2 వేలకు విక్రయించినట్లు గుర్తించామన్నారు. డేటా చోరీపై సైబర్‌క్రైం పోలీసులకు అందిన పలు ఫిర్యాదుల ఆధారంగానే దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నామన్నారు.

భారీగా డేటా చోరీ...

నిందితులు చోరీ చేసిన డేటాలో 1.47 కోట్ల కార్ల యజమానుల, డొమైన్ వాయిస్ డేటాబేస్ 3.47 కోట్లు, మొబైల్ నంబర్ల డేటాబేస్ 3 కోట్లు, స్టూడెంట్ డేటాబేస్ 2 కోట్లు, వాట్సాప్ యూజర్లు 1.2 కోట్ల మంది డేటా చోరీ గురైంది. అలాగే జాబ్ సీకర్స్ డేటాబేస్ 40 లక్షలు, సీబీఎస్ఈ 12వ తరగతికి చెందిన 12 లక్షల మంది విద్యార్థులు, సివిల్ ఇంజనీర్ల వివరాలు 2.3 లక్షలు, డెబిట్ కార్డుల సమాచారం 8.1 లక్షలు, సీనియర్ సిటిజన్స్ 10.6 లక్షలు, వెబ్‌సైట్ ఓనర్స్ 17.4 లక్షలు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ డేటా చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు.

గుర్తించిన అంశాలు...

- పలు ఆర్థిక సంస్థలు, సోషల్ మీడియా, జస్ట్ డయల్ వంటి సంస్థలు ప్రజల అనుమతి లేకుండానే డేటాను సేకరిస్తున్నాయి.
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో సేవలందించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు, వ్యక్తుల ద్వారా డేటా చోరీకి గురవుతున్నట్లు పోలీసులు గుర్తించారు.
- గోప్యంగా ఉంచాల్సిన డేటా భద్రంగా ఉందోలేదో సర్వీసు ప్రొవైడర్లు తనిఖీ చేయట్లేదని తేలింది.
- జస్ట్ డయల్ లాంటి సంస్థల్లో డేటా విక్రయానికి అందుబాటులో ఉంది.

పోలీసుల సూచనలు...

- మీ డేటాను ప్రైవేటు కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిస్తే మాకు ఫిర్యాదు చేయండి.
- క్రెడిట్ కార్డులు, బ్యాంకింగ్ వివరాలను అపరిచితులకు, సంస్థలకు చెప్పొద్దు.
- మొబైల్, కంప్యూటర్, యాప్‌లు ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

కేసు దర్యాప్తు సిట్‌కు బదిలీ


దేశ భద్రతకు సంబంధించిన సమాచారం ముడిపడి ఉన్నందున డేటా చోరీ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నిర్ణయించినట్లు సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. ఇందుకోసం డీసీపీ (క్రైమ్స్) కల్మేశ్వర్ నేతృత్వంలో 'సిట్'ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ టీమ్‌లో సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ రితిరాజ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఇతర అధికారులు ఉంటారని తెలిపారు.

క్రెడిట్ కార్డుదారుల డేటా చోరీ ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: బ్యాంకుల్లో డేటా చోరీ చేసే ముఠాను సైబర్‌క్రైం పోలీసులు అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. క్రెడిట్ కార్డుల వెరిఫికేషన్ చేస్తున్న థర్డ్ పార్టీకి చెందిన సిబ్బంది డేటాను చోరీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన 1,780 మంది కస్టమర్ల డేటాతోపాటు ఎస్‌బీఐకి చెందిన 140 మంది కస్టమర్ల డేటా చోరీకి గురైందన్నారు. ఢిల్లీ కేంద్రంగా సాగుతున్న ఈ దందాలో ప్రధాన నిందితుడు కఫిన్ అహ్మద్, మహ్మద్ సమాల్, మహ్మద్ అసీఫ్, చిరాగ్, విరేంద్ర సింగ్, ప్రదీప్ వాలియా, ఆకాశ్‌నిర్వాన్, విరాట్ పురి, అతీత్ దాస్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 13 సెల్‌పోన్లు, ల్యాప్‌టాప్, క్రెడిట్ కార్డుల డేటా స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి CELEBRATING 15 YEARS

ఈ అనుబంధం నిరంతరం



- 2017 ఆగస్టులో ఆదిలాబాద్ జెడ్పీ సమావేశం జరుగుతోంది. అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మంచిర్యాలలో భూకబ్జాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ మహాజీలో నమోదై ఉందని అన్నారు. ఇది గమనించిన 'సాక్షి' ప్రతినిధి అలాంటి రెవెన్యూ బాగోతాలపై పరిశోధన చేశారు. అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తండ్రి లక్ష్మణరావు పేరిట 57.04 ఎకరాల ప్రభుత్వ భూమి నమోదై ఉన్నట్టు ఆధారాలు లభించాయి. ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసిన తర్వాత 'నడిపెల్లి లక్ష్మణరావు @ 57.04 ఎకరాలు' శీర్షికన 2017 ఆగస్టు 21న 'సాక్షి' వార్తా కథనం ప్రచురించింది.

✔ రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఈ వార్తతో అధికారుల్లో, ప్రజాప్రతినిధుల్లో కదలిక వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు వెంటనే స్పందించి ఆ భూమికి తనకు ఎలాంటి సంబంధం లేదని, వెంటనే స్వాధీనం చేసుకోవాలని హైదరాబాద్‌లో సీసీఎల్ఏను కలిసి విన్నవించారు కూడా. అదొక 'సాంకేతిక సమస్య' అని అప్పటి ఆర్డీఓ మీడియాతో చెప్పారు. దీనిపై పరిశోధన సాగించిన 'సాక్షి' రిజిస్ట్రేషన్‌లో లింక్ చేసిన ఆధార్ వివరాలు సేకరించి.. అదే నెల 27న మరో కథనాన్ని ప్రచురించింది. నడిపెల్లి లక్ష్మణరావు 2003లోనే చనిపోగా.. అలాంటి పేరు గల నడిపెల్లి లక్ష్మీకాంతరావు ఆధార్‌ను పెట్టి, 2010 సంవత్సరం తర్వాత ఈ భూమిని రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కించిన విషయాన్ని ఆధారాలతో సహా ప్రచురించింది.

- సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

మసివాగుపై తాత్కాలిక వంతెన



- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.. ఇల్లెందు మండలంలోని మిట్టపల్లి గ్రామం పరిధిలో మసివాగు ఉంటుంది. చిన్నవాన పడ్డా వాగు ఉప్పొంగి మిట్టపల్లి మీదుగా ఇల్లెందు, బయ్యారం మండలాల్లోని పదిహేను గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. గిరిజనులు వాగుపై చెట్ల తీగలు, కొమ్మలు, చెక్కలతో వంతెనలా ఏర్పాటు చేసుకున్నా.. అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు వీలయ్యేదికాదు. ఈ కష్టాలను వివరిస్తూ.. 2010 సెప్టెంబర్ 8న 'చెట్లపై నిచ్చెన మెట్లు.. ఎన్నాళ్లీ ఇక్కట్లు' శీర్షికన 'సాక్షి' కథనం ప్రచురించింది. ఆ మరునాడే మిట్టపల్లికి చెందిన బానోత్ జమ్కు(50) అనే మహిళ తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ వాగు దాటలేక, చికిత్స అందక మృతి చెందింది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అదే నెల 12న 'మసివాగు వంతెన.. శ్రమదానంతోనైనా నిర్మిస్తాం' అని గిరిజనుల వాయిస్‌తో మరో కథనం ప్రచురితమైంది.

✔ 'సాక్షి' కథనాలతో అప్పటి ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్పీ క్రాంతి రాణా మిట్టపల్లి వెళ్లి గిరిజనుల ఇక్కట్లను పరిశీలించారు. స్థానిక డీఎస్పీ, యాదగిరిరెడ్డి అనే వ్యాపారి సహకారంతో మసివాగుపై తాత్కాలికంగా ఇనుప వంతెన నిర్మించారు. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 2011 మేలో శాశ్వత వంతెన పనులు మొదలుపెట్టింది. 2013 మార్చి 24న ప్రారంభించింది. ఇప్పుడు పల్లె వెలుగు బస్సులు పరుగులు తీస్తుండడంతో పదిహేను గ్రామాల ప్రజల ఇక్కట్లు తీరిపోయాయి.

- ఇల్లెందు

ఎల్బీనగర్ లాడ్జిలో ఎవరెవరు కలిశారు?

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాలోని తమ ఇంటికి తీసుకువెళ్లారు. రెండు రోజుల పాటు అక్కడే ఉంచి పరీక్షలకు సిద్ధం చేశారు. ఈ నెల 4 రాత్రి నీలేష్, గోపాల్, డాక్యాలతో పాటు అతడి సమీప బంధువు రాజేందర్ రెండు వాహనాలపై ఎల్బీనగర్‌కు వచ్చారు. అక్కడి ఓ లాడ్జిలో బస చేశారు. మర్నాడు సరూర్‌నగర్‌లోని పరీక్ష కేంద్రంలో నీలేష్, గోపాల్‌తో పరీక్ష రాయించారు. అయితే వీళ్లు లాడ్జిలో ఉండగా కొందరు వచ్చి కలిసినట్లు సిట్ అధికారులకు ఆధారాలు లభించాయి. దీంతో వాళ్లు అభ్యర్థులేనా? కొన్ని ప్రశ్నలు లేదా ప్రశ్నపత్రాన్ని నీలేష్, గోపాల్ వారితో పంచుకున్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సాంకేతిక ఆధారాలతో పాటు సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్ ఆధారంగా ముందుకు వెళ్తున్నారు. 9 మంది నిందితుల్ని మరో నాలుగు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

జైలుకు మరో ముగ్గురు నిందితులు...

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష లీకేజ్ వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీలో పని చేస్తున్న, చేసిన వారి పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. 2013లో గ్రూప్–2 ద్వారా ఎంపికై, ప్రస్తుతం కమిషన్‌లో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న షమీమ్ అనే మహిళకు రాజశేఖర్ ద్వారా గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష పత్రం అందింది. దీని ఆధారంగా పరీక్ష రాసిన ఆమె ఏకంగా 127 మార్కులు పొందింది. కమిషన్‌కు చెందిన ఓ సభ్యుడి వద్ద పీఏగా పని చేస్తున్న డి.రమేష్ కుమార్‌తో పాటు మాజీ ఉద్యోగి సురేష్‌కు ప్రవీణ్ ద్వారా ఈ క్వశ్చన్ పేపర్ చేరింది. వీరిలో రమేష్‌కు 122 మార్కులు, సురేష్‌కు 107 మార్కులు వచ్చినట్లు సిట్ గుర్తించింది. ఈ ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. వీరిని వారం రోజుల కస్టడీకి అప్పగించాలని కోరుతూ శుక్రవారం పిటిషన్ దాఖలు చేయనున్నారు.

25 మంది అభ్యర్థులకు నోటీసులు..

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షల్లో 100కు పైగా మార్కులు సాధించిన 25 మందికి అధికారులు నోటీసులు జారీ చేశారు. నిర్ణీత తేదీల్లో విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. విడతల వారీగా మొత్తం 121 మందికి నోటీసులు ఇవ్వనున్నారు. టీఎస్‌పీఎస్సీ కస్టోడియన్ శంకరలక్ష్మిని మరోసారి విచారించాలని నిర్ణయించారు.

తెరపైకి రాజశేఖర్ బంధువు

ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో రెండో నిందితుడిగా ఉన్న రాజశేఖర్ సమీప బంధువు ప్రశాంత్ పేరు తాజాగా వెలుగులోకి వచ్చింది. కొన్నేళ్లుగా న్యూజిలాండ్‌లో నివసిస్తున్న ప్రశాంత్ గ్రూప్–1 పరీక్షకు దరఖాస్తు చేసుకున్నాడు. గతేడాది అక్టోబర్‌లో నగరానికి వచ్చి ప్రిలిమినరీ పరీక్ష రాసి వెళ్ళాడు. ఈ పరీక్షలో క్వాలిఫై అయిన ప్రశాంత్ 100కు పైగా మార్కులు పొందినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో ఇతడికి లీకైన గ్రూప్–1 పేపర్ అందిందా? అని అనుమానిస్తున్న సిట్ అధికారులు ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పశు పోషకులకు తక్కువ ధరలకే నాణ్యమైన పశువుల జనరిక్ మందులను అందించే లక్ష్యంతో దేశంలోనే తొలిసారిగా వైఎస్సార్ పశు ఔషధ నేస్తం పథకాన్ని అందుబాటులోకి తెస్తున్నామని ఏపీ పశు సంవర్థక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 52 పశు ఔషధ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయవాడలోని పశు సంవర్థక శాఖ డైరెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి జనరిక్ పశు ఔషధ కేంద్రాన్ని గురువారం మంత్రి అప్పలరాజు ప్రారంభించారు.

అర్చకులకు వేతనాలు చెల్లించండి

జోగుళాంబ శక్తిపీఠం: రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయశాఖలో పని చేస్తున్న అర్చకులకు, ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని అర్చక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌శర్మ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. వేతనాలు రాక పోవడంతో పండుగ వేళ కన్నీటి పర్యంతమవుతున్నారన్నారు. మూడు నెలలకు ఒక సారి వేతనాలనను వారి ఖాతాల్లో జమచేస్తున్నప్పటికీ అది కేవలం ఒక నెలకు సంబంధించిన వేతనం మాత్రమే ఇస్తు, మరో రెండు నెలల పెండింగ్‌లో పెడుతున్నారన్నారు. ఆలయాల్లో పని చేసే అర్చకులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు అందుతున్నాయన్న మాటే కానీ, రెండేళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతి నెల వేతనాలు తీసుకున్న పరిస్థితి మాత్రం లేదన్నారు. పెద్ద ఆలయాల్లో పని చేసే అర్చకులకు భక్తులు ఇచ్చే దక్షిణలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా, చిన్నఆలయాల్లో అర్చక, ఉద్యోగుల పరిస్థితి మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అర్చకుల వేతనాల విషయంలో చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గ్రూప్‌-4 పరీక్ష కోసం ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టీఎస్‌పీఎస్సీ గ్రూప్–4 పరీక్ష కోసం బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తామని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఏ.స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీలోగా మెట్టుగడ్డలోని బీసీ స్టడీ సర్కిల్‌లో మహబూబ్ నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుందని, వచ్చే నెల 4 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 08542–293790లో సంప్రదించవచ్చని సూచించారు.

ఇంటర్ విద్యార్థికి అస్వస్థత

పాలమూరు: ఇంటర్ పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థి పరీక్ష రాస్తుండగా అస్వస్థతకు గురైన సంఘటన మహబూబ్‌నగర్‌లో చోటు చేసుకుంది. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ పరీక్ష రాసేందుకు బిందు గురువారం ఉదయం పరీక్ష కేంద్రానికి వచ్చింది. కాసేపటికి ఛాతీలో నొప్పి రావడంతో గుండెపోటుగా భావించి.. అధికారులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈసీజీతో పాటు 2డీ ఈకో చేయించి హార్ట్ స్పెషలిస్టుతో పరీక్ష చేయించారు. గ్యాస్ట్రిక్, ఇతర సమస్యతో నొప్పి వచ్చిందని.. చికిత్స అందించి పరిశీలనలో ఉంచినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్ వెల్లడించారు.

మాహె రంజాన్ ప్రారంభం



జిల్లా కేంద్రంలోని రహిమానియా ఈద్గా

- మోగిన రంజాన్ సైరన్
- నేటి నుంచే ఉపవాసాలు
- మసీదుల్లో ప్రారంభమైన తరావీ నమాజ్

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం గురువారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో ప్రారంభమైంది. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం 9వ మాసమైన రంజాన్ ప్రారంభ సూచికంగా మసీదుల్లో సైరన్ మోగించారు. ముస్లింలు ఉపవాసాలను శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభించారు. ప్రత్యేక ప్రార్థనలకు మసీదులన్నీ విద్యుత్‌కాంతులతో ముస్తాబయ్యాయి. రంజాన్ నెలలోనే పవిత్ర గ్రంథం దివ్యఖురాన్ అవతరించిందని ఇస్లాం మతస్తుల ప్రగాఢ నమ్మకం. ఉపవాస దీక్షలు ప్రతి ముస్లింపై విధిగా నిర్ణయమై ఉన్నాయని ఖురాన్‌లో పేర్కొనడంతో వారందరూ ఉపవాస దీక్షలు ఉంటారు. ఇంత పవిత్రమైన ఈనెలలో చేసే ప్రతి పుణ్యకార్యానికి 70రెట్ల ప్రతిఫలం లభిస్తుందని విశ్వసిస్తారు. ఉపవాస దీక్షల (రోజా) వల్ల దైవభీతి, పాప భయం జనిస్తుందని దైవవాణి పేర్కొనడంతో ముస్లింలు అత్యంత భక్తి ప్రపత్తులు, కఠోర ఉపవాస దీక్షలను పాటిస్తారు.

ఉపవాస దీక్ష విశేషాలు..

రంజాన్‌లో 30రోజులు ఉపవాస దీక్షలు పాటించాలి. సూర్యోదయం కంటే ముందే నిర్ధారిత సమయంలో ఆహార పానీయాలు తీసుకోవాలి. దీనిని 'సహర్' అంటారు. సూర్యాస్తమ సమయంలో ప్రతి రోజు కొన్ని నిమిషాల తేడాతో ఉపవాస దీక్ష విరమణ నిర్దేశించమైనది. దీనిని 'ఇఫ్తార్' అంటారు. బెండు ఖర్జూరం తదితర పండ్లతో ఉసవాస దీక్ష విరమిస్తారు. ఉపవాస దీక్ష సమయంలో విధిగా నమాజులు చేయాలి. అనైతిక ధర్మవిరుద్ధమైన చర్యలకు పాల్పడకుండా ఉండాలి. అపవిత్రమైన చర్యల వల్ల ఉపవాస దీక్ష లక్ష్యం దెబ్బతింటుంది. ఉపవాస దీక్ష కేవలం ఆహారం, నీరు తీసుకోవడమే కాదు, దీక్షాపరులు అన్ని రకాల చెడు కార్యాలు, అధర్మ పాపక్రియల నుంచి దూరంగా ఉండాల్సి ఉంటుంది. ఏ వ్యక్తి అయితే రంజాన్ నెలలో ఉపవాసం ఉంటాడో అతడు చేసిన పాపాలన్నీ క్షమింపబడుతాయన్నది నమ్మకం. రంజాన్ దీక్షలు నరకాగ్ని నుంచి కాపాడుతుందని హదీస్ (ప్రవక్త ప్రవచనాల సంపుటి) చెబుతుంది. ఏ కారణం లేకుండా ఎవరైనా రంజాన్ దీక్ష తప్పితే ఆ తర్వాత వారు ఎన్ని ఉపవాసాలున్నా కోల్పోయిన దానికి సమానం కాదని విశ్వాసం. ఉపవాసం ఉండి చేసే ప్రార్థనను అల్లాహ్ (దైవం) ఎప్పుడు తిరస్కరించడనీ చెబుతారు.

ప్రత్యేక తరావీహ్ నమాజ్..

రంజాన్ మాసంలో ఉపవాసంతోపాటు ప్రత్యేక తరావీహ్ నమాజ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. మసీదుల్లో హాఫీజ్‌లు ఖురాన్‌ను పఠిస్తారు. గురువారం రాత్రి నుంచి నెల రోజులపాటు ప్రతిరోజు రాత్రివేళ మసీదుల్లోను, ఇళ్ల వద్ద 20 రకాత్‌ల ప్రత్యేక తరావీహ్ నమాజ్ ప్రార్థనలు చేస్తారు. ముస్లిం సోదరులు ఖురాన్‌ను పఠించి, విని అనంతమైన భావజాలంలో తరిస్తారు. కొన్ని మసీదుల్లో 10రోజులపాటు ప్రతి రోజు ఖురాన్‌లోని మూడు పారాలు పఠించడానికి ఏర్పాటు చేశారు.

స్వీపింగ్ మిషన్‌లో మంటలు

వనపర్తి టౌన్: పురపాలికలో గురువారం పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని ప్రధాన రహదారులను శుభ్రం చేసేందుకు తీసుకొచ్చిన స్వీపింగ్ మిషన్ కింది భాగంలో మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు బోర్ మోటార్ సాయంతో మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో కమిషనర్ విక్రమసింహారెడ్డి ఫైర్ ఇంజన్ అధికారులకు ఫోన్ చేశారు. స్పందించిన అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటను అదుపులోకి తెచ్చారు. మంటల్లో స్వీపింగ్ మిషన్ రెండు ఆయిల్ పైపులు కాలిపోవడంతో అందులోంచి ఆయిల్ అంతా బయటకు వచ్చింది. రహదారులను శుభ్రం చేసే స్వీపింగ్ మిషన్ బ్రెష్‌లు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, కమిషనర్ విక్రమసింహారెడ్డి, మేనేజర్ అనిల్, కౌన్సిలర్లు వెంకటేష్, పుట్టపాకల మహేష్, అఖిల పక్ష ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ సతీష్‌యాదవ్ తదితరులు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది చంద్రశేఖర్, మంటు ఆర్పేందుకు సహకరించిన స్థానికులను చైర్మన్ అభినందించారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

చట్టం అందరికీ సమానం

పాలమూరు: చట్టం అందరికీ సమానమని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. జిల్లా న్యాయ సేవ సదన్ భవన్‌లో గురువారం ప్యానల్ న్యాయవాదులు, జ్యువెన్ జస్టిస్ బోర్డు న్యాయవాదులు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నేరం చేసిన వారికి చట్టం ఎదుట శిక్ష తప్పదన్నారు.

1,020 అగుగుల నీటి మట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 920, సమాంతర కాల్వ ద్వారా 246 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 875, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

అచ్చంపేటలో పోస్టర్ల వార్..

గులాబీ పార్టీలో సద్దుమణగని అంతర్గత పోరు

సాక్షి, నాగర్‌కర్నూల్: అచ్చంపేట నియోజకవర్గంలోని అధికార గులాబీ పార్టీలో పోస్టర్ల దుమారం నెలకొంది. ఇప్పటికే ఫ్లెక్సీలు, పోస్టర్ల విషయంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎంపీ రాములు మధ్య ఇటీవల మాటల యుద్ధం కొనసాగిన విషయం తెలిసిందే. తన ఫొటో లేకుండా ఎంపీ రాములు తనయుడు భరత్‌ప్రసాద్ పేరిట కడుతున్న ఫ్లెక్సీలను తొలగించాలని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. తాజాగా గురువారం ఎంపీ రాములు, ఆయన కుమారుడు భరత్ ప్రసాద్ ఫొటోలతో 'ఉగాది, శ్రీరామ నవమి శుభాకాంక్షలు' పేరుతో అచ్చంపేట పట్టణంతో పాటు పలుచోట్ల వాల్‌పోస్టర్లు వెలిశాయి. అయితే వీటిల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఫొటో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సదరు పోస్టర్లను ఎమ్మెల్యే అనుచరులు తొలగిస్తుండటంతో వివాదం మళ్లీ ముదురుతోంది. గులాబీ పార్టీలోని సొంత నేతల మధ్య వైరం ముదురుతుండటంతో పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనని నియోజకవర్గంలోని పార్టీ కేడర్ ఆందోళన చెందుతున్నారు.



అచ్చంపేటలో ఎంపీ రాములు, కుమారుడు భరత్ ఫొటోలతో వెలిసిన వాల్‌పోస్టర్లు

అందరి కృషితో ఆర్టీసీ లాభాల బాట

ఆర్టీసీ ఈడీ పురుషోత్తం



అచ్చంపేట బస్టాండ్‌లో బైక్ పార్కింగ్ స్టాండ్‌ను పరిశీలిస్తున్న ఈడీ పురుషోత్తం

అచ్చంపేట రూరల్: అందరి కృషితో ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తుందని, సిబ్బంది మరింత కృషి చేయాలని ఈడీ పురుషోత్తం సూచించారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్ పరిసరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపో పరిధిలోని రూట్లను డీఎం రాజశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. పల్లె, పట్టణ రూట్లలో వస్తున్న ఆదాయంపై ఆరా తీశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సర్వీసులను నడిపించాలని ఆదేశించారు. ప్రతి డిపో పరిధిలో మహిళా ఉద్యోగులకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేశామని, వేసవిలో సిబ్బందికి చల్లని మజ్జిగను అందిస్తున్నామన్నారు. డిపో పరిధిలో ఆదాయ వనరులు పెంచాలన్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అన్ని వసతులు కల్పించాలన్నారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. తిరుపతి, శ్రీశైలం, శబరి ప్రదేశాలకు కొత్తగా సూపర్ లగ్జరీ సర్వీసులను నడిపిస్తున్నామన్నారు. శుభకార్యాలకు తక్కువ ఖర్చుతో బస్సులను అద్దెకు ఇస్తున్నామన్నారు.

రోగులతో ఆప్యాయంగా మెలగాలి



ఆస్పత్రి వైద్య సిబ్బందితో కమిటీ సభ్యులు

మరికల్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులతో వైద్య సిబ్బంది ఆప్యాయంగా ఉండాలని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ సభ్యులు అమర్ బోది, రోణిక్‌శర్మ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెండో రోజు గురువారం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో 14 నేషనల్ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. సబ్ సెంటర్‌లో నిర్వహించే హెల్త్ న్యూట్రిషన్, రోజు వారి ఓపీ వివరాలు, శానిటేషన్, వ్యాధి నిరోధక టీకాల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులోనే ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. గర్భిణులను గుర్తించి మెరుగైన వైద్య సేవలను అందించాలని తెలిపారు.